సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 11 । మార్చి । 2023

I




## రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శాశ్వత నిత్య సుదర్శన హోమానికి కిళాంబి రాఘవాచారి, లక్ష్మి దంపతులు (న్యూఢిల్లీ) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



## అన్నదమ్ములే నిందితులు

గత నెల 24న రాయవరం మండలం మాచవరం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. - IIలో▸

## తండ్రీకొడుకుల దుర్మరణం



సామర్లకోట పై ఓవర్ బ్రిడ్జి కూడలిలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటనపై ఆగ్రహం చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, ఎఫ్‌సీఐ జట్టు కూలీలు ఆందోళన నిర్వహించారు. - IIలో▸

# సౌకర్యం పొత్తిళ్లలో తల్లీబిడ్డ

- పేదలకు మేలు చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్
- ఈ ఏడాది 3,361 మంది సురక్షితంగా ఇళ్లకు
- గత ప్రభుత్వ హయాంలో ఐదు వాహనాలు మాత్రమే
- మరమ్మతులు లేక అక్కరకు రాని వైనం
- జిల్లాకు కొత్తగా 13 వెహికిల్స్ ఇచ్చిన ప్రభుత్వం



అమలాపురం ఏరియా ఆస్పత్రి వద్ద బాలింత, శిశువును ఇళ్లకు తీసుకుని వెళుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్.



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

సాక్షి అమలాపురం: గత ప్రభుత్వ హయాంలో అక్కరకు రాకుండా పోయిన తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్... ప్రస్తుత సర్కారు సారథ్యంలో చక్కగా పనిచేస్తోంది. వందల మంది పేద, సామాన్యుల తల్లీబిడ్డలను గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తోంది. పేద బాలింతలకు వీటితో ఉన్న అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం కొత్త వాహనాలు ఇవ్వడంతోపాటు... వాటిని జిల్లాలో అవసరం మేరకు సమకూర్చడంతో ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులకు వచ్చే సుదూర ప్రాంతాల వారికి అధికంగా మేలు జరుగుతోంది.

**అన్ని ప్రాంతాల్లో అందుబాటులో..**

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కోనసీమ (అమలాపురం డివిజన్ పరిధి)లో ఐదు తల్లీబిడ్డ వాహనాలు ఉండేవి. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతోపాటు తరచూ మరమ్మతులకు గురికావడంతో ఇవి మూలన పడ్డాయి. సుదూర ప్రాంతాల నుంచి కాన్పులకు ప్రభుత్వాసుపత్రులకు వచ్చే పేదలు, సామాన్యులు వ్యయప్రయాసలకు లోనయ్యేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన జిల్లాకు 13 వాహనాలను కేటాయించింది. అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రులకు రెండు చొప్పున నాలుగు వాహనాలను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లకు ఎనిమిది వాహనాలను కేటాయించారు. జిల్లాలో రాజోలు, అల్లవరం, పి.గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట, ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం సీహెచ్‌సీల వద్ద అందుబాటులో ఉంచారు. మలికిపురం మండలం లక్కవరం పీహెచ్‌సీ వద్ద ఒకటి చొప్పున ఉంచారు. ఈ వాహనాలే పేద, సామాన్య తల్లీబిడ్డలను వారి ఇళ్లకు సురక్షితంగా, సుఖవంతంగా చేరుస్తున్నాయి. గత ఏప్రిల్ ఒకటి నుంచి ఫిబ్రవరి 28 వరకు జిల్లా వ్యాప్తంగా 3,361 మంది తల్లీబిడ్డలను ఉచితంగా ఇళ్లకు చేర్చాయి.

**తీర,లంక వాసులకు ప్రయోజనం**

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు తీర ప్రాంత, లంక గ్రామాల వాసులకు అధికంగా మేలు చేస్తున్నాయి. జిల్లాలో ఐ.పోలవరం మండలం భైరవపాలెం నుంచి సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం వరకు తీరాన్ని ఆనుకుని పలు మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. కాట్రేనికోన మండలంలో పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, చిర్రయానాం, గచ్చకాయల పొర, చిర్రయానాం, నీళ్లరేవు, పోర గ్రామాలు ఇటు ముమ్మిడివరం, అటు అమలాపురానికి 30 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇటువంటి ప్రాంతాలకు చంటిబిడ్డలతో బాలింతలు వెళ్లడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్న విషయం. ప్రైవేట్ వాహనాలపై తీసుకుని వెళ్లాలంటే కనీసం రూ.రెండుమూడు వేల వరకు ఖర్చవుతుంది. అదే ఆటోల మీద వెళితే తల్లీబిడ్డలకు అపాయం. ఇటువంటి వారికి తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ ప్రయోజనకరంగా మారింది. జిల్లాలో కపిలేశ్వరపురం, అయినవిల్లి, ముమ్మిడివరం, పి.గన్నవరం లంక గ్రామాలకు చెందినవారు సైతం ఈ ఎక్స్‌ప్రెస్ వల్ల ప్రయోజనం పొందుతున్నారు.

### ఆటోలో వెళితే రూ.వెయ్యి



నాకు అమలాపురం ఏరియా ఆస్పత్రిలో అమ్మాయి పుట్టింది. మా ఊరు నక్కా రామేశ్వరం వెళ్లాలంటే ఆటోకే రూ.వెయ్యి అవుతోంది. కాని తల్లీ బిడ్డ వాహనంలో ఉచితంగా తీసుకుని వెళ్లారు. నాతోపాటు మా అమ్మ, చెల్లి కూడా వచ్చారు. సామాన్లు కూడా ఈ వాహనంలో తీసుకువెళ్లాం.

- పాలెపు గంగాభవానీ, నక్కా రామేశ్వరం, అల్లవరం మండలం

### ఆదరణ పెరిగింది



కొత్త వాహనాలు వచ్చిన తరువాత ఆదరణ పెరిగింది. ఎంతోమంది పేదలకు ఈ వాహనం అక్కరకు వస్తోంది. ఎక్కువగా తీర ప్రాంత మండలాలకు చెందిన మత్స్యకారులకు లబ్ధి చేకూరుతోంది.

- కె.స్వామినాయుడు, జిల్లా మేనేజర్, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్

## నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందిస్తున్న నవీన్, రామచంద్రయ్య తదితరులు

రామచంద్రపురం: ఏపీలో చాలా ప్రదేశాల్లో నకిలీ గిరిజన కుల సర్టిఫికెట్లతో గిరిజనేతరులు లబ్ధి పొందుతున్నారని, అలాంటి సర్టిఫికెట్లను రద్దు చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, ఏపీ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడమల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే నిరుపేద స్థితిలో ఉన్న 32 లక్షల మంది గిరిజనులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ తరుణంలో అభివృద్ధి చెందిన ఇతర కులాలకు చెందిన వారు నకిలీ గిరిజన సర్టిఫికెట్లతో నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. రామచంద్రపురంలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొంది గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబుని కలిసి చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కౌన్సిలర్ అమలదాసు లోవరాజు, జై భీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగరాజు, జిల్లా అధ్యక్షుడు గంధం బంగారుబాబు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### పవర్ లిఫ్టింగ్ పోటీల బ్రోచర్ల విడుదల




బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 11,12 తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ మెన్ అండ్ వుమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీల బ్రోచర్లను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక హైస్కూలు సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమలాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలతో జిల్లాకు మరింత గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్సీకి వివరించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, పార్టీ నాయకులు చప్పిడి శోభన్‌బాబు, యనమదల కరుణాకర్ పాల్గొన్నారు.

### రేపు జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూలు ఆడిటోరియంలో జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం ఆదివారం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకూ జరిగే ఈ ఉగాది కవి సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది కవులు పాల్గొంటారని శ్రీశ్రీ కళావేదిక జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు.

### చైల్డ్ సైకాలజీలో పీజీ డిప్లొమా



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆచార్య ప్రసాదరాజు తదితరులు

రాజానగరం: చైల్డ్ అండ్ అడోల్సెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించనున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. సంబంధిత బ్రోచర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యాన ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సులో ప్రవేశానికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7093 00 8477 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కోర్సు కో ఆర్డినేటర్ నక్కిన నారాయణ, పడాల రాజశేఖర్, సీహెచ్ భవాని పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యుత్ అందించాలి

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో వినియోగదారులకు జవాబుదారీగా ఉంటూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని డివిజన్ల అధికారులతో రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్ చౌర్యం, లైన్ల నవీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పనకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, అధికారులు తిలక్ కుమార్, నక్కపల్లి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి నీటి ఎద్దడి రాకుండా చర్యలు

**కలెక్టర్ శుక్లా**




వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా కార్యాచరణ ప్రణాళికలను సమర్థంగా అమలు పరచాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వివిధ మండలాల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి సీజన్ తాగునీటి కార్యాచరణ ప్రణాళిక అమలు విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు ఎంపీడీవోలు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రచించి అమలు పరచాలన్నారు.

- 2023–24 విద్యా సంవత్సరం నుంచి 12 (1) (ఇ) అనుసరించి జిల్లాలో అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు కోసం ఐదు శాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు చెందిన పిల్లలకు ఆరు శాతం సీట్లు కేటాయించినట్టు చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలకు ఒకటి తరగతి విద్యార్థుల నమోదులో 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు.
- సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు స్త్రీ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, పాఠశాల విద్యాశాఖలు కీలక భూమిక పోషించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాల విద్య, గ్రామ, వార్డు సచివాలయాల గ్రీవెన్స్ పరిష్కారం, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల పురోగతిపై సమీక్షించి జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ స్థానికంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వచ్చిన నిధులతో మహాప్రస్థానం వాహనాన్ని కొనుగోలు చేస్తామని, దానికి అవసరమైన నిర్వహణ వ్యయాన్ని ప్రభుత్వం నుంచి మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన సీఎస్ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నిర్వహణ నిధులు కేటాయిస్తామన్నారు. జేసీ ధ్యానచంద్రతోపాటు పలువురు పాల్గొన్నారు.
- పాలపొడి దగ్గర నుంచి సిమెంట్ వరకు ప్రతి ఉత్పత్తికి సంబంధించి బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) నిర్దేశిత ప్రమాణాలను నిర్ణయిస్తుందని, వాటిని తప్పక పాటించాలని విజయవాడ బీఐఎస్ ప్రమోషన్ ఆఫీసర్ ఎ.అనూప్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం క్వాలిటీ సర్టిఫికేషన్ వస్తువుల వినియోగం, నాణ్యత ప్రమాణాలపై జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో పిల్లలకు అవగాహన కల్పించేందుకు స్టూడెంట్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. బంగారు ఆభరణాలకు హాల్ మార్క్ తప్పనిసరి అని తెలిపారు.

## గోదావరి డెల్టాకు నీటి విడుదల

సీలేరు (అల్లూరి సీతారామరాజు): గోదావరి డెల్టా భూములకు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఎస్ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జలవనరుల శాఖ అధికారుల ఆదేశాలతో గత ఏడాది డిసెంబర్ చివరి వారం నుంచి డెల్టా అవసరం మేరకు ఎప్పటికప్పుడు నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. డెల్టా భూములకు మరింత నీరు కావాల్సి ఉన్నందున శుక్రవారం నీటి విడుదల ఆరంభించామని, వారం రోజుల వరకూ ఇది కొనసాగుతుందని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ నుంచి ఇప్పటి వరకూ ఆరు టీఎంసీల జలాలు విడుదల చేశామని పేర్కొన్నారు. ఇది కాకుండా పొల్లూరు విద్యుత్ కేంద్రంలో రోజు వారీ ఉత్పత్తి అనంతరం మరో 4,300 క్యూసెక్కులు కూడా గోదావరిలో చేరుతుందని తెలిపారు. సీలేరు, డొంకరాయి, పొల్లూరు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని ఎస్ఈ తెలిపారు.



## రవ్వ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడి మృతి



ఎస్.యానంలో రవ్వ ప్లాంటు ఎల్‌క్యూ గేటు వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న దృశ్యం

- ఆందోళనకు దిగిన గ్రామస్తులు
- మద్దతు పలికిన పలువురు నాయకులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామానికి చెందిన వేదాంత, కెయిర్న్ ఎనర్జీ సంస్థల రవ్వ ప్లాంట్‌లోని కాంట్రాక్టు కార్మికుడు పెట్టా రామకృష్ణ (32) శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు, దళిత నాయకులు రామకృష్ణ మృతదేహాన్ని ప్లాంటు ఎల్‌క్యూ గేటు ఎదురుగా ఉంచి కొన్ని డిమాండ్లతో ఆందోళనకు దిగారు. వారి కథనం ప్రకారం రామకృష్ణది నిరుపేద కుటుంబం. స్థానికంగా ఉన్న రవ్వ ప్లాంటులో కాంట్రాక్టు కూలీగా పనిచేస్తున్నాడు. భార్య సుధ ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు. ప్లాంటులో పనిచేస్తున్న రామకృష్ణను ఇటీవల కొన్ని కారణాల రీత్యా విధుల నుంచి తప్పించారని, అప్పటి నుండి తరచూ ప్లాంటుకు వెళ్లి ఉద్యోగం కోసం ప్రయత్నించినా నిర్వాహకులు స్పందించక పోవటంతో మనో వేదనకు గురై రామకృష్ణ మృతి చెందాడని వారు తెలిపారు. ఈ ఆందోళనకు దళిత నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, గెద్దాడ బుద్దరాజు, రేవు తిరుపతిరావు, గ్రామస్తులు లంకే శ్రీను, భీమరాజు, జోగి అర్జున్‌రావు, రాజా, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, జనసేన, కాంగ్రెస్ పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జులు శెట్టిబత్తుల రాజాబాబు, అయితాబత్తుల సుభాషిణి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ జె.వెంకటేశ్వరి రూరల్ సీఐ వీరబాబు ఆందోళన చేస్తున్న ప్రాంతానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఐఎన్‌టీయూసీ రవ్వ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్లాంటు అధికారులతో చర్చలు జరిపి మృతి చెందిన రామకృష్ణ కుటుంబానికి రూ.6లక్షల ఇన్సూరెన్స్ అందించేలా అతని భార్య సుధకు ప్లాంటులో ఉద్యోగం ఇచ్చి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించేలా చర్చలు జరిగినప్పటికీ ఆందోళన చేస్తున్నవారు తొలుత అంగీకరించలేదు. చర్చల అనంతరం తొలగించిన ఐదుగురికీ ఉద్యోగాలు ఇవ్వడంపై పది రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని, సుధకు ఉద్యోగం ఇచ్చి, పిల్లల చదువుల ఖర్చులు భరించేందుకు, అలాగే రూ.6లక్షల బీమాతో పాటు రూ.15 లక్షలు ఇచ్చేందుకు ప్లాంటు అధికారులు అంగీకరించినట్టు ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## ఉపకరణాలు వినియోగించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

అమలాపురం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, భవితా సెంటర్లలో చదువుతున్న ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కమలకుమారి అన్నారు. సమగ్ర శిక్ష, కోనసీమ జిల్లా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అమలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన నిర్ధారణ శిబిరాన్ని డీఈవో ప్రారంభించారు. ఎంఈవో గుబ్బల సూర్యప్రకాష్ అధ్యక్షతన ఈ శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ డాక్టర్లచే ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 220 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. 54 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బస్‌పాస్‌లు అందించారు. ఏఎంఓ పిల్లి రాంబాబు, అమలాపురం ఐ.ఇ. కో ఆర్డినేటర్ ఎం.వీర వెంకట సత్యనారాయణ, జిల్లా అధికారులు బొరుసు సుబ్రహ్మణ్యం, దొండపర్తి రమేష్‌బాబు పాల్గొన్నారు.

# యాప్‌రే ఏమి రికవరీ!

- పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను వెతికిపెట్టే యాప్ చాట్‌బాట్
- పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇచ్చే పని లేదు
- ఒక్క మెసేజ్‌తో కేసు నమోదు లేకుండానే పోలీసు సేవలు



జిల్లాలో యాప్ ద్వారా వెతికి పట్టుకున్న సెల్‌ఫోన్లు



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను ఫిర్యాదుదారుకు అందిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

అమలాపురం టౌన్: కేవలం ఒకే ఒక మెసేజ్‌తో చోరీకి గురైన లేదా ఎక్కడైనా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు వెతికి మరీ తెచ్చి ఇస్తున్నారు. గతంలో సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వడం... ఎఫ్ఐఆర్...కేసు నమోదు...దర్యాప్తు ఇలా బోలెడంత ప్రక్రియ ఉండేది. సెల్‌ఫోన్లు చోరీ చేసిన దొంగ దొరికినప్పుడు మాత్రమే ఆ ఫోన్లు రికవరీ అయ్యేవి. అయితే ఇప్పుడు సెల్‌ఫోన్ పోతే దానిని వెతకడం పోలీసు శాఖకు సులభమైంది. ఇటీవల రాష్ట్ర పోలీసు శాఖ సెల్‌ఫోన్ల వెతికి పట్టుకునేందుకు చాట్ బాట్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ అందుబాటులోకి వచ్చిన రెండు నెలల కాలంలో జిల్లాలో 600 మంది మెసేజ్ ద్వారా ఫిర్యాదులు చేశారు. అందులో ఇప్పటికే జిల్లా పోలీసులు 100 ఫోన్లను యాప్ సహకారంతో వెతికి పట్టుకుని ఫిర్యాదుదారులకు అప్పగించారు. ఇప్పుడు 80 శాతం ప్రజలు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. వాటి కొనుగోలుకు రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ఫోన్ పోతే ఏదో పెద్ద ఆస్తి పోయినట్టుగా బాధపడుతున్నారు. ఈ క్రమంలో చాట్ బాట్ యాప్ అటు ప్రజలకు..ఇటు పోలీసులకు గొప్ప ఉపశమనాన్ని ఇస్తోంది. ఫోన్ పోతే ఆందోళన చెందకుండా ఆ యాప్‌లోకి వెళ్లి ఓ ఫోన్ నంబర్‌కు ఫోన్ సమాచారాన్ని వాట్సాప్ చేస్తే సరిపోతుంది.

**8522913300 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయాలి**

ఫోన్ పొగొట్టుకున్న వ్యక్తి తొలుత వేరే ఫోన్ నుంచి 8522913300 నంబరుకు వాట్సాప్ ద్వారా హాయ్ లేదా హెల్ప్ అని ఒక మెసేజ్ పంపాలి. వెంటనే వెల్‌కమ్ టూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీస్ పేరున ఒక లింకు వస్తుంది. ఆ లింకులో గూగుల్ ఫారం ఓపెన్ అవుతుంది. అందులో పోయిన ఫోన్ వివరాలు, చిరునామా, కాంటాక్ట్ ఫోన్ నంబరు పూరించాలి. జిల్లా పేరు, వయసు, కాంటాక్ట్ నంబరుతో పాటు పోగొట్టుకున్న ఫోన్ మోడల్, ఐఎంఈఐ నంబర్, పోగొట్టుకున్న ప్రాంతం సబ్మిట్ చేసిన వెంటనే మనం ఇచ్చిన ఫిర్యాదు ఓకే అవుతుంది. మీరు కేవలం మెజేస్ ద్వారా యాప్‌లో ఇచ్చిన వివరాల ఆధారంగా పోలీసులు మీ ఫోన్‌ను గుర్తించే పనిలో పడతారు. ఫోన్ దొరికిన తర్వాత పోలీసులు అందజేస్తారు. జిల్లాలో రికవరీ చేసిన 100 ఫోన్లను ఇటీవల ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ ఫిర్యాదుదారులకు అందిస్తున్నప్పుడు ఆ యాప్ గురించి, పోలీసు సేవల గురించి ప్రశంసలు కురిపించారు. తూర్పుగోదావరి జిల్లాలో యాప్ ద్వారా అందిన 500 ఫిర్యాదులకు గాను 150 ఫోన్లను రికవరీ చేశారు.

### యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చాట్ బాట్ యాప్‌ను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ఆ యాప్ వల్ల సెల్‌ఫోన్ల చోరీలకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. మిగతా జిల్లాలతో పోల్చుకుంటే తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సెల్‌ఫోన్ల మాయం కేసులు తక్కువే. దానికి ప్రధాన కారణం చాలామంది సెల్‌ఫోన్లను అతి జాగ్రత్తగా చూసుకుంటారు. యాప్ వచ్చాక పోలీసులు శ్రమించి, అన్వేషించి ఫోన్లు వెతికి పట్టుకుంటున్నారు.

- సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

## ప్రగతికి జాతీయస్థాయిలో 2వ ర్యాంక్

- ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ఘనత
- కళాశాల చైర్మన్ కృష్ణారావు




ఎడ్యుస్కిల్ వర్చువల్ ఇంటర్న్‌షిప్



డాక్టర్ పి.కృష్ణారావు, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఇ) వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ మేరకు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు శుక్రవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి 155 ఉన్నత విద్యాసంస్థల నుంచి 59,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా ప్రగతి విద్యార్థులు 2,150 మంది పాల్గొన్నారన్నారు. నాలుగు విశిష్ట విభాగాల్లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయడం ద్వారా ఈ ఘనత సాధించామని తెలిపారు. ఏడబ్ల్యూఎస్ (అమెజాన్ వెబ్ సర్వీస్) అకాడమీ విభాగంలో 575, డేటా ఎనలిటిక్స్ ప్రాసెస్ ఆటోమెషిన్ ఇంటర్న్‌షిప్ అండర్ అల్ట్రిక్సి 261, మైనింగ్ ప్రాసెస్ అండర్ సెలొనిస్ 71, సైబర్ సెక్యూరిటీ అండర్ లో ఆల్టో 455, రోబొటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ అండ్ బ్లూ ప్రిజమ్ 369, నెట్‌వర్కింగ్, నెట్‌వర్క్ క్లౌడ్‌లలో 419 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులను కళాశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవీ హరినాథబాబు, డైరెక్టర్ శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ అభినందించారు.

## సర్కార్ ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు

పుదుచ్చేరి అసెంబ్లీలో కేంద్రానికి కృతజ్ఞతలు



అసెంబ్లీలో కృతజ్ఞతలు తెలియజేస్తున్న యానాం ఎమ్మెల్యే అశోక్

యానాం: కాకినాడ నుంచి చెంగల్పట్టు వరకు నడిచే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించేలా నిర్ణయం తీసుకున్నందుకు శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్ ఆర్.సెల్వం, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లుగా ఢిల్లీ వెళ్లినప్పుడల్లా సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించాలని స్పీకర్ సెల్వం, సెల్వ గణపతితో కలిసి రైల్వే మంత్రిత్వశాఖకు అనేక సార్లు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు.

**స్పీకర్ సెల్వంకు, ఎమ్మెల్యే అశోక్ సత్కారం**

సర్కార్ పొడిగింపుకు కృషి చేసిన ఆర్.సెల్వంను పుదుచ్చేరి అసెంబ్లీ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ సత్కరించారు. అనంతరం స్పీకర్ సెల్వం మాట్లాడుతూ సర్కార్ పొడిగింపునకు యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక పట్టువదలకుండా చేసిన విశేష కృషి ఫలితమే ఈ విజయమని అన్నారు.

# పదోగతి ఎలా ఉందంటే..

- నేడు టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం
- పర్యవేక్షించనున్న జిల్లా విద్యాశాఖ అధికారులు



రాయవరం: వచ్చే నెల మూడో తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఏపీ సమగ్ర శిక్షా అధికారులు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతిని వివరిస్తారు. ఇప్పటికే పాఠశాల పేరెంట్స్ కమిటీ ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తోంది. ఆత్మ విశ్వాసంతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు తల్లిదండ్రులకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో తల్లిదండ్రుల పాత్ర, వారి బాధ్యతలు, కుటుంబ సభ్యుల సహకారాన్ని వివరించనున్నారు. సమావేశాలకు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా హెచ్ఎం/ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలి. ఉత్తమ ఫలితాలను రాబట్టేందుకు ఈ సమావేశాలు దోహద పడాలన్నది ఏపీ సమగ్ర శిక్షా లక్ష్యం. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ నెల 15వ తేదీలోగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాల్సి ఉంది.

### హెచ్ఎం/ఉపాధ్యాయులకు సూచనలు

- ఇప్పటి వరకు విద్యార్థులు రాసిన పరీక్షల ఫలితాలు, విద్యార్థి స్థాయిని తల్లిదండ్రులకు వివరించాలి.
- వివిధ సబ్జెక్టుల్లో అధిక మార్కులు సాధించే అంశాలు, సోషల్‌లో మ్యాప్ పాయింటింగ్, సైన్స్‌లో చిత్రపటాలు, ప్రయోగాలు, లాంగ్వేజెస్‌లో లెటర్ రైటింగ్, గ్రామర్ టిప్స్ తదితర అంశాలపై ఫోకస్ చేయాలి.
- విద్యార్థులు స్టడీ అవర్స్‌కు హాజరయ్యేలా చూడడం, మోడల్ ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేసేలా చూడడం.
- పరీక్షల భయం పోగొట్టేందుకు కష్టమైన టాపిక్స్‌లో విద్యార్థులను సంసిద్ధులను చేయాలి.
- విద్యార్థుల ప్రగతిని పరిశీలన చేయాలే తప్ప, వారిపై ఒత్తిడి తీసుకురాకూడదు. అవసరమైన సహకారం అందించాలి.
- పరీక్షలు ముగిసే వరకు సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులను పరిశీలన చేస్తుండాలి.
- విద్యార్థులకు వారి స్థాయిలకు అనుగుణంగా ఉపాధ్యాయులు మార్గదర్శకం చేస్తుండాలి.
- ఆరు పేపర్ల విధానంపై అవగాహన కల్పించాలి.
- ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించాలి.
- రోజూ 6–7 గంటల పాటు నిద్ర అవసరమని చెప్పాలి. టీవీ, మొబైల్ ఫోన్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా విద్యార్థులను మోటివేట్ చేయాలి.

**జిల్లాలో పరిస్థితి**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 531 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 69,290 మంది రెగ్యులర్ విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారు.

**పది రెగ్యులర్ విద్యార్థులు ఇలా..**

| జిల్లా | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|
| తూర్పుగోదావరి | 11,230 | 11,509 | 22,739 |
| కాకినాడ | 13,647 | 13,820 | 7,467 |
| కోనసీమ | 9,806 | 9,278 | 19,084 |

**సమావేశాలు తప్పనిసరి**



పది పరీక్షలు సమీపిస్తున్నందున ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యార్థుల విద్యా స్థాయిపై తల్లిదండ్రులతో చర్చించాలి. పరీక్షలకు 23 రోజులు మాత్రమే గడువు ఉంది. ఉపాధ్యాయులతో పాటుగా, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

# తండ్రీకొడుకుల దుర్మరణం

- మోపెడ్‌ను ఢీకొన్న అపెక్స్ ఫ్యాక్టరీ బస్సు
- ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కుటుంబ సభ్యులు, బంధువుల నిరసన
- రెండు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్
- ఫ్యాక్టరీ యాజమాన్యం హామీతో ఆందోళన విరమణ



మంగబ్బాయి (పాత చిత్రం)



సత్తిబాబు (పాత చిత్రం)



బంధువుల బైఠాయింపుతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి కూడలిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతిచెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం పుప్పాల మంగబ్బాయి (62) స్థానిక సత్యనారాయణపురంలోని ఎఫ్‌సీఐలో ఎగుమతి, దిగుమతి పర్మినెంట్ కూలీగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశాడు. అతని పెద్ద కుమారుడు సత్తిబాబు (41) పెద్దాపురంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ కలసి మోపెడ్‌పై సత్యనారాయణపురం నుంచి కాకినాడ వెళుతున్నారు. కాకినాడ నుంచి వస్తున్న అపెక్స్ రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన బస్సు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు కొన ఊపిరితో ఉన్న ఇద్దరిని అంబులెన్సులో స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేటప్పటికి ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, ఎఫ్‌సీఐ జట్టు కూలీలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైకి చేరుకున్నారు. దాంతో ఘటనా ప్రదేశంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఘటనా ప్రదేశంలోనే ఇద్దరూ చనిపోయారని, పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించారని బాధితులు ఆరోపించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలిలో బైఠాయించడంతో ట్రాఫిక్ రెండు గంటల పాటు స్తంభించింది. విషయం తెలుసుకున్న అపెక్స్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు ఘటనా ప్రదేశానికి చేరుకొని మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఘటనా స్థలిలో తీవ్రంగా గాయపడ్డ మంగబ్బాయి, సత్తిబాబు



రోదిస్తున్న సత్తిబాబు కుమార్తె వెంకటలక్ష్మి, బంధువులు

**రెక్కాడితేనే గాని డొక్కాడని కుటుంబం..**

డెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో తండ్రీ కొడుకులు మృతి చెందడంతో సత్యనారాయణపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పుప్పాల సత్తిబాబుకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సత్తిబాబు తండ్రి వద్దనే ఉంటున్నాడు. మిగిలిన ఇద్దరు వేరు వేరుగా ఉంటున్నారు. సత్తిబాబుకు భార్య సత్యవేణి, 18 సంవత్సరాల కుమార్తె వెంకటలక్ష్మి ఉన్నారు. కుమార్తెకు పెళ్లి కావలసి ఉంది. సత్తిబాబు మృతి చెందడంతో భార్య, కుమార్తెలు భోరున విలపించారు. మండే ఎండలో రోడ్డుపై వారు రోదించిన తీరు స్థానికుల హృదయాలను కలచి వేసింది. యాజమాన్యం బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే శనివారం మృతదేహాలతో ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తామని ఎఫ్‌సీఐ కార్మిక సంఘ నాయకుడు చల్లా కొండ హెచ్చరించారు.

**రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం, ఉద్యోగం**

మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మృతుని బంధువులతో ఫ్యాక్టరీ ప్రతినిధులు నష్టపరిహారం విషయమపై చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున చెల్లించడంతో పాటు వారి కుటుంబాల్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారు. బస్సుకు వచ్చే ప్రమాద ఇన్సూరెన్సు సొమ్ము బాధిత కుటుంబానికి ఇచ్చేలా ఒప్పుకున్నారు. చర్చలలో సీఐ కె.దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, కౌన్సిలర్లు, పాల్గొన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏటికొప్పాక ఖ్యాతి చెక్కు చెదరదు

పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సీవీ రాజు



సీవీ రాజును సత్కరిస్తున్న అకాడమీ అధికారులు

రాజానగరం: చైనా నుంచి వెల్లువలా వస్తున్న బొమ్మలు ఎంత పోటీ ఇస్తున్నప్పటికీ ఏటికొప్పాక బొమ్మలకు ఉన్న ఖ్యాతి ఏనాటికీ చెక్కు చెదరదని అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక వన సంరక్షణ సమితి అధ్యక్షుడు సీవీ రాజు అన్నారు.

2023 సంవత్సర పద్మశ్రీ అవార్డుకు కళారంగం నుంచి ఎంపికైన నేపథ్యంలో దివాన్‌చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ ఆహ్వానించడంతో శుక్రవారం వచ్చారు. శిక్షణలో ఉన్న అటవీ అధికారులు, వన సంరక్షణ సమితుల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొన్నారు. గత 550 ఏళ్లుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ బొమ్మల తయారీలో ఏటికొప్పాక ప్రత్యేకతను సంపాదించుకుందన్నారు.

కళానైపుణ్యం, సాంకేతికత, వనరులు ఒకేచోట ఉన్న గ్రామం కావడంతో ఇక్కడ పుట్టిన వారికి 12 ఏళ్ల వయసుకే బొమ్మల తయారీలో ఇంజినీర్ స్థాయి పరిజ్ఞానం అలవడుతుందన్నారు. బొమ్మల నాణ్యత, ఆకర్షణీయమైన తయారీల వల్లనే మన్‌కీ బాత్‌లో ప్రధాని ఏటికొప్పాక కళను శ్లాఘించారన్నారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు ఏటికొప్పాక బొమ్మలు లేని పుణ్యక్షేత్రం లేదనడం అతిశయోక్తి కాదని సీవీరాజు పేర్కొన్నారు.

**పర్యావరణ హితంగా బొమ్మల తయారీ**

ఏటికొప్పాక బొమ్మలకు ఇంతటి పేరు రావడానికి ప్రధాన కారణం అవి పర్యావరణ హితంగా ఉండటమేనని అకాడమీ డైరెక్టర్ పీవీ ఉదయ్‌భాస్కర్ అన్నారు. అంకుడు చెట్లను అశాస్త్రీయంగా నరికివేయడం వలన కొన్నేళ్ల కిందదట ముడిసరుకు లభ్యతలో తలెత్తిన సమస్యల పరిష్కారంలోను, బొమ్మలకు పూర్తి సహజరంగులు వాడేట్టు చేయడంలోను సీవీ రాజు కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం సీవీరాజును అకాడమీ తరఫున సత్కరించారు. సీసీఎఫ్ శ్రీశరవణన్, రంపచోడవరం డీఎఫ్ఓ నరేంద్ర, అకాడమీ ఏసీఎఫ్‌లు డాక్టర్ ఎన్వీ శివరామప్రసాద్, ఏవీ రమణమూర్తి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్..

# అన్నదమ్ములే నిందితులు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలచంద్రారెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ శివగణేష్, ఎస్సై సురేష్

రాయవరం: గత నెల 24న రాయవరం మండలం మాచవరం గ్రామ సమీపంలో మండపేట–కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పంట పొలాల్లో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు దారి తీసిన పరిణామాలను, హత్యాచార వివరాలను రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి శుక్రవారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. హతురాలు సత్యవేణి, నిందితులు నల్లమిల్లి ఉమామహేశ్వరరెడ్డి, వెంకట సత్యనారాయణరెడ్డి దేవుడు కాలనీలో నివసిస్తున్నారు. గతంలో నిందితులు సత్యవేణితో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె పెద్దలకు తెలియజేసింది. దీన్ని మనసులో ఉంచుకున్న నిందితులు సత్యవేణి హత్యకు ప్రణాళిక రచించారు. ఎప్పటి నుంచో వేచి చూస్తున్న వీరికి గత నెల 23 రాత్రి సత్యవేణి మాచవరం వంతెన వద్ద నుంచి రాత్రి 8 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వస్తోంది. విషయాన్ని గమనించిన నిందితులు చినతలుపులమ్మ లోవకు వెళ్లే సమీపంలో ఒంటరిగా వస్తున్న సత్యవేణిని పంట దిమ్మపైకి లాక్కుని వెళ్లి నిందితులు ఇద్దరూ అత్యాచారం చేశారు. ఆపై అక్కడే లభించిన వైరును మెడకు బిగించి హత్యకు పాల్పడ్డారు. ఆమె శరీరంపై ఉన్న బంగారు వస్తువులను తీసుకుని, ఆమెను గడ్డివామిలో పెట్టి దగ్ధం చేశారు. ఇదిలా ఉంటే హత్య కేసులో తన కుమారులు ఉన్నారన్న తెలిసిన నిందితుల తల్లి పద్మ ఈ నెల 8న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిన విషయం విదితమే. నిందితులను శుక్రవారం పసలపూడి సమీపంలో పుంత రోడ్డులో పోలీసులు అదుపులోకి తీసుకుని, అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరు పర్చారు.

**తొలుత మిస్టరీగా మారిన కేసు**

గత నెల 24న గుర్తుపట్టలేని విధంగా కాలిపోయిన మృతదేహం మహిళదా..పురుషునిదా అన్న సందేహం పోలీసులకు ఏర్పడింది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

**మహిళ అదృశ్యం కేసుపై దృష్టి సారించి**

ఈ పరిస్థితుల్లో హత్య జరిగిన సమీపంలోని దేవుడు కాలనీకి చెందిన కొవ్వూరి సత్యవేణి అదే రోజు నుంచి అదృశ్యమైన విషయంపై పోలీసులు దృష్టి సారించారు. ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన మహిళ కదలికలను గమనించారు.

**హత్య కేసుగా మార్పు**

పోలీసులు తొలుత 302, 201 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులు నేరం అంగీకరించడంతో 302, 376బి, 435, 404, 201 రెడ్ విత్ 34గా సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ బాలచంద్రారెడ్డి తెలిపారు. మండపేట రూరల్ సీఐ శివగణేష్, రాయవరం ఎస్సై పీవీఎస్ఎస్ సురేష్ పాల్గొన్నారు. కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్స్ ఏసుకుమార్(అంగర పోలీస్ స్టేషన్), బీవీవీ సత్యనారాయణ, పి.రాజు(రాయవరం పోలీస్‌స్టేషన్), మహిళా పోలీసులు అనిత, నాగేశ్వరి(మాచవరం), కె.నాగమణి(సోమేశ్వరం), ఎస్.ధనలక్ష్మి(చెల్లూరు)లను డీఎస్పీ అభినందించారు.

## నదిలో మునిగి వ్యక్తి మృతి

పి.గన్నవరం: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం ఇసుక ర్యాంపు సమీపంలో శుక్రవారం గేదెలు మేపుతున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ వశిష్ఠ నదీపాయలో మునిగి మృతిచెందాడు. ఎస్సై పి.గంగాభవాని తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం శివారు కోటవారిపేటకు చెందిన వ్యవసాయ కూలీ నేలపూడి చంటిబాబు (30) శుక్రవారం వైవీ పాలెం వద్ద గేదెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో నదిలోకి దిగిన చంటిబాబు ప్రమాదవశాత్తూ నీట మునిగిపోయాడు. దీనిని గమనించిన ర్యాంపులోని కూలీలు అతడిని బయటకు తీసి, పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని బావ పి.లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గంగాభవాని వివరించారు.

## మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

ఏడు వాహనాలు స్వాధీనం



పోలీసులు పట్టుకున్న మోటారు సైకిళ్ల దొంగ, స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో కొంతకాలంగా మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఇటీవల కాలంలో తాళం వేసి ఉన్న మోటారు సైకిళ్లు మాయం అయిన ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టూటౌన్ సీఐ ఆ దిశగా దృష్టి సారించారు. ఈ క్రమంలో కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన మన్యం వెంకట హరికృష్ణపై అనుమానం వచ్చింది. అతని కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు అతనిని నగరంలోని సుబ్బాయమ్మఘాట్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఐదు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందినవి కాగా, మరొకటి త్రీటౌన్, ఇంకొకటి దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందినవి ఉన్నాయి. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ ప్రజలు మోటార్ సైకిల్ దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోటార్ సైకిళ్లను పార్కు చేసే సమయంలో బండికి హ్యాండ్ లాక్, డిస్క్ లాక్ తప్పనిసరిగ్గా వేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినట్లు కనిపిస్తే వెంటనే 100, 112 పోలీసు హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎస్సై జీవీవీ సత్యనారాయణ, కేఎం జోషి, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.రాజశేఖర్, కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబులను జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ శ్రీలత అభినందించారు.

## మోటారు సైకిళ్లు ఢీకొని యువకుడి మృతి

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారులో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన సోమనాథ్ ఉమా మహేష్(21) మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన సోమనాథ్ ఉమామహేష్(21), అదే గ్రామానికి చెందిన అతని మిత్రుడు పాఠంశెట్టి గంగాతేజేశ్వరరావు(తేజ)తో కలిసి మల్లిసాల శివారు సింగరమ్మ చింత వద్ద జరుగుతున్న సింగరమ్మ జాతర చూసేందుకు గురువారం రాత్రి బయలుదేరారు. మల్లిసాల శివారులో ఎదురుగా వేగంగా వస్తున్న మరో మోటారు సైకిల్ వీరిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమామహేష్ తలకి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు తేజకు కూడా గాయాలు కావడంతో స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.